సంక్షిప్తంగా

నల్లబర్లీలో 20 శాతం లోపు తేమ ఉండాలి



పంగులూరులో నల్లబర్లీ పొగాకు పరిశీలిస్తున్న ఏఓ సుబ్బారెడ్డి



తమ్మవరంలో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సుబ్బారెడ్డి

జె.పంగులూరు: రైతులు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాలకు తీసుకొని వెళ్లే ముందు తప్పనిసరిగా ప్రభుత్వం నిర్ణయించిన నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా గ్రేడింగ్, తేమ 20 శాతం లోపు ఉండే విధంగా చూడాలని ఏఓ సుబ్బారెడ్డి రైతులకు సూచించారు. మండల పరిధిలోని పంగులూరులో శనివారం రైతుల ఇంటి ముందు ఉన్న పొగాకును ఏఓ సుబ్బారెడ్డి పరిశీలించారు. కొనుగోలు కేంద్రానికి పొగాకు చెక్కులు తీసుకొనివచ్చే ముందు తప్పని సరిగా గ్రేడింగ్, తేమ శాతం, చెక్కుపై పట్టలు విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. తద్వారా మంచి ధర పలుకుతుందని తెలిపారు.

చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తాం

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని తమ్మవరం గ్రామంలో ఇటీవల ప్రారంభించిన నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రంలో చివరి ఆకువరకు కొనుగోలు చేస్తామని తహసీల్దార్ సుబ్బారెడ్డి అన్నారు. శనివారం పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులకు నిర్ణయించిన తేదీల్లో పొగాకును కేంద్రానికి తీసుకువచ్చి విక్రయించుకోవాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకున్నట్లు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పొగాకు కొనుగోలుకు చర్యలు

యద్దనపూడి: నల్లబర్లీ పొగాకు అమ్ముకునేందుకు రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు మార్కుఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తామని వ్యవసాయాధికారి ఎస్‌వీపీ కుమారి అన్నారు. శనివారం గన్నవరం, యద్దనపూడి, జాగర్లమూడి గ్రామాల్లో పొగాకు రైతులకు అవగాహన కల్పించారు. కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునే రైతులు కేటాయించిన షెడ్యూల్ తేదీల్లో మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్లాలన్నారు. పొగాకు చెక్కులు కేంద్రాలకు తెచ్చేముందు తప్పనిసరిగా గ్రేడింగ్, 20 శాతం లోపు తేమశాతం ఉండేలా చూసుకోవాలని వివరించారు. పొగాకు గ్రేడింగ్ సక్రమంగా చేసుకొని ఏ గ్రేడ్‌కు ఆ గ్రేడ్ అంటే పైఆకులను (హెచ్‌డీఆర్) మొదటి రకం, రెండో రకం మధ్య ఆకులు (హెడ్‌డీబీ), కింది ఆకులు (హెచ్‌డీఎక్స్) మూడోరకం.. విడివిడిగా చెక్కులు ఉండేలా చూసుకోవాలన్నారు.



పొగాకు చెక్కులు తొక్కుతున్న రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ కుమారి

స్త్రీనిధి రికవరీ నూరు శాతం చేయండి



ఏపీఎంను సన్మానిస్తున్న నాయకులు, అధికారులు, వీవోఏలు

జె.పంగులూరు: గ్రామ సంఘాల్లో ఇచ్చిన స్త్రీనిధి రికవరీలు నూటికి నూరు శాతం ఉండాలని అధికారులు తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం ఏపీఎం కోటేశ్వరరావు అధ్యక్షతన మండల సమైఖ్య సమావేశం జరిగింది. కొత్త రుణాలు తీసుకొని సభ్యుల జీవనోపాధులు పెంచుకోవాలని తెలిపారు. అనంతరం బదిలీపై అద్దంకి వెళ్ళిన ఏపీఎం జ్యోతి ప్రసాద్‌బాబును సన్మానించారు. సీసీలు, వీఓఏలు, గ్రామ సంఘం అధ్యక్షులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

సకాలంలో రేషన్ అందించేందుకు చర్యలు



రేషన్ డీలర్‌లు సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

ఇంకొల్లు(చినగంజాం): రేషన్ డీలర్‌లు లబ్ధిదారులకు సకాలంలో రేషన్ అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఇంకొల్లు తహసీల్దార్ ఏవీఎస్ శ్రీనివాస్ ఆదేశించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్‌తో మాట్లాడారు. రేషన్ కార్డుదారులతో మర్యాద పూర్వకంగా మాట్లాడాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే సకాలంలో రేషన్ పంపిణీ చేయాలని, ముందుగా డీలర్లంతా చలానాలు సకాలంలో తీసుకొని నిత్యావసర సరుకులు గోడౌన్ పొందాలని ఆదేశాలు జారీ చేశారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సురేష్, 41 మంది రేషన్ డీలర్‌లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



చీరాల పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చీరాల అర్బన్: మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్లు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్, కార్మికులు చేస్తున్న సమ్మె నేటికి ఏడు రోజులకు చేరుకుందన్నారు. జీవో నెంబర్ 36ను అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సుప్రీం స్పష్టం చేసినా ప్రభుత్వాలు అమలు చేయడంలేదన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందించాలని, ఎక్స్‌గ్రేషియా రూ.5లక్షల నుంచి రూ. 7లక్షల వరకు పెంచాలని, వయోపరిమితి 62 సంవత్సరాలకు పెంచాలన్నారు.

అద్దంకి రూరల్: కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ప్రజా ఆరోగ్యవేదిక రాష్ట్ర నాయకులు కావూరి రఘు చంద్ అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయం మెయిన్‌రోడ్ పై కార్మికులు మానవహారం నిర్వహించి నిరసన తెలియజేశారు. తంగిరాల వెంకటేశ్వర్లు, డి. గంగాధర్, పి. ఆదాం, గాలి భీష్మ, వి.జాన్, శామ్యూల్ పాల్గొన్నారు.



అద్దంకిలో మానవహారం

క్షయను తరిమికొడదాం

కారంచేడు: సమాజం నుంచి క్షయ వ్యాధిని తరిమికొట్టేందుకు ప్రజలతో పాటు, వైద్య సిబ్బంది ప్రత్యేక కృషి చేయాలని కారంచేడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గోరంట్ల సురేష్‌బాబు అన్నారు. శనివారం మండల కేంద్రమైన కారంచేడు గ్రామంలో ఏర్పాటు చేసిన క్షయ వ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు వారాలకు మించి దగ్గు ఉంటే వెంటనే సమీప ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. జ్వరం తరచుగా రావడం, సాయంత్రం సమయాల్లో చెమటలు పట్టడం, ఛాతీలో నొప్పి, ఆయాసం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. టీబీ సూపర్‌వైజర్ నరేంద్ర, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణానికి రక్షణ

అద్దంకి రూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మున్సిపల్ కమిషనర్ డి. రవీంద్ర అన్నారు. శనివారం స్థానిక గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో శింగరకొండ డంపింగ్ యార్డు వద్ద మొక్కలు నాటించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ అద్దంకి పట్టణంలో 19 మెట్రిక్ టన్నుల చెత్త వస్తోందన్నారు. దానిని మూడు విధాలుగా రీసైక్లింగ్ చేస్తే ప్లాస్టింగ్ మెటీరియల్ తయారవుతుందని వివరించారు. తిమ్మాయపాలెం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రనను ఎంపీడీవో సింగయ్య నిర్వహించారు.

ప్లాస్టిక్‌తో అనర్థాలు తప్పవు



మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

వేటపాలెం: స్వచ్ఛాంధ్ర, ప్లాస్టిక్ నిర్మూలన కోరుతూ వేటపాలెం, దేశాయిపేట హైస్కూల్ విద్యార్థులు శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి పంచాయతీ సిబ్బంది, విద్యార్థులు మానవహారంగా ఏర్పడిన అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఆమోదగిరి పట్నంలోని హైస్కూల్ విద్యార్థులు గ్రామంలో ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ చేశారు. ప్లాస్టిక్ వల్ల వచ్చే అనర్థాల గురించి వివరించారు. వేటపాలెం, దేశాయి పేట కార్యదర్శులు సురేంద్ర, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు కె. సుధాకర్, వై. రత్నం, రాజ్యలక్ష్మి, పద్మావతి విద్యార్థులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాల అవసరాలు గుర్తించాలి

ఇంకొల్లు(చినగంజాం): బంగారు కుటుంబాల అవసరాల ప్రాధాన్యతను గుర్తించాలని ఎంపీడీఓ జి. శ్రీనివాసరావు కోరారు. మండల వెలుగు కార్యాలయంలో శనివారం మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎంపీడీఓ జి. శ్రీనివాసరావు పాల్గొన్నారు. సర్వే పూర్తి అయిన తరువాత వారికి సహాయ సహకారాలను అందించాలని తెలియజేశారు. ఏపీఎం అనురాధ, సీసీలు, అకౌంటెంట్ పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానంతో ఉపయోగం

బల్లికురవ: ప్రతి ఓటరు ఓటు గుర్తింపు కార్డుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని తహసీల్దార్ యం. రవినాక్ శనివారం కోరారు. ఓటుకు ఆధార్ అనుసంధానం చేయకపోతే ఓటర్లు రెండు మూడు ప్రాంతాల్లో ఓటు హక్కు వినియోగించుకోనే అవకాశం ఉందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం తీసుకొచ్చిన ఈ నిర్ణయాన్ని అమలు పర్చేందుకు సహకరించాలని కోరారు.

గొర్రెలు, మేకలకు టీకాలు

బల్లికురవ: మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో 13 శివారు గ్రామాల్లో గొర్రెలు, మేకలకు వ్యాధులు సోకకుండా వ్యాక్సిన్‌లు వేస్తున్నట్లు మండల పశువైద్యాధికారి పి. మహేశ్వరరావు శనివారం తెలిపారు. 50 వేల గొర్రెలకు నీలినాలుక సోకకుండా వ్యాక్సిన్ వేసినట్లు చెప్పారు. 50 శాతం సబ్సిడీపై 40 మెట్రిక్ టన్నుల పశుదాణ పంపిణీ చేశామని, రెండోసారి పంపిణీకి 20 మెట్రిక్ టన్నులు ఇండెంట్ పెట్టినట్లు చెప్పారు. పశువులు అనారోగ్యానికి గురైతే 1962కు ఫోన్‌చేస్తే సంచార వాహనం ద్వారా చికిత్స అందుతుందని తెలిపారు.

24న ఇంకొల్లులో జాబ్ మేళా

పర్చూరు(చినగంజాం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, మారుతి ఐటీఐ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో 24వ తేదీ గురువారం ఇంకొల్లులో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి. ప్రణయ్ తెలియజేశారు. జాబ్ మేళాకు హెటిరోలాబ్స్, స్కిల్ క్రాఫ్ట్, హీరో, డైకిన్, బ్రహ్మసాయి సొసైటీ, యాక్సిస్ బ్యాంక్ కంపెనీలు హాజరవుతున్నట్లు, 300కి పైగా ఖాళీలు ఉన్నాయని తెలియజేశారు. రూ. 12 వేల నుంచి రూ. 20 వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా, ఫార్మసీ విద్యార్థులు బయోడేటా, సర్టిఫికెట్‌ల జిరాక్స్, ఆధార్, పాస్‌పోర్ట్ ఫోటోలతో హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం వినోద్ 6302764962, 9988853335 నంబర్లను సంప్రదించాలని కోరారు.